ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

శనివారం 6 సెప్టెంబరు 2025



తురకపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు



◆ తురకపాలెంలో పర్యటిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే రామాంజనేయులు

అంతు చిక్కని మరణాలపై పరీక్షలు

తురకపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం

- నివేదికల తర్వాతే జ్వరాలపై స్పష్టత ఇస్తామన్న నేతలు
- గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- తురకపాలెం మరణాలపై సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అంతు చిక్కని వరుస మరణాలపై వైద్య పరీక్షలు కొన సాగుతున్నాయి. శుక్రవారం కూడా గ్రామంలో పలు వురి నుంచి రక్తనమూనాలు సేకరించి వివిధ పరీక్షలకు పంపారు. రక్తనమూనాల పరీక్ష ఫలితాల కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ పరీక్ష ఫలితాలతో.. మరణాలకు కారణమైన సూక్ష్మజీవిని నిగ్గు తేల్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సైతం వేచి ఉన్నారు. గ్రామానికి చెందిన 44 మంది జ్వర బాధితుల నుంచి సేకరించిన రక్తనమూనాలకు గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ ల్యాబోరేటరీలో పరీక్షించగా 9 బ్యాక్టీరియా పాజిటివ్‌గా నివేదికలు వచ్చినట్లు తెలిసింది. కాగా గ్రామానికి చెందిన పీ నరసింహరావు (40) జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, ఆయాసంతో బాధ పడుతూ ప్రైవేటు వైద్యశాలలో చేరగా అతడ్ని పరీక్షించగా మెలియాయిడోసిస్ పాజిటివ్ తేల్చారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తురకపాలెం గ్రామానికి చెందిన ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రబలిన అంతు చిక్కని జ్వరాల నేపథ్యంలో గ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీగా భావించి విధులు నిర్వహించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు గ్రామంలో పర్యటించారు. అనంత రం స్థానిక ప్రజలతో మాట్లాడి (మిగతా 8వ పేజీలో)

పడిపోయిన పరపతి



60 ఏళ్ల చరిత్రలో అధమ స్థానం

- ఎన్జీ రంగా వర్సిటీకి 31వ ర్యాంకు
- వైసీపీ పాలకుల పాపం.. యూనివర్సిటీకి శాపం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరపతి జాతీయ స్థాయిలో పతనావస్థకు చేరింది. వర్సిటీ 60 ఏళ్ల చరిత్రలో ఎన్నో నూతన ఆవిష్కరణలతో అగ్రస్థానంలో నిలిచి ప్రస్తుతం అథః పాతాళానికి చేరింది. తాజాగా విడుదలైన నేషనల్ ఇనిస్ట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ -2025లో 31వ ర్యాంకుకు పడిపోయింది. రెండేళ్లుగా జాతీయ స్థాయిలో యూనివర్సిటీ ర్యాంకు వరుసగా పడిపోతూనే ఉంది. 2023లో ఎన్ఐఆర్ఎఫ్ సర్వేలో వర్సిటీ 20వ ర్యాంకును, 2024లో 26వ ర్యాంకు సాధించింది. ఈ సంవత్సరం ర్యాంకు మరింత దిగజారింది. జాతీయ స్థాయిలోని వ్యవసాయ అనుబంధ యూనివర్సిటీల్లో అనేక అంశాలను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. ఆ లెక్కన ఈ ఏడాది ఎన్జీ రంగా యూనివర్సిటీకి 100 మార్కులకు కేవలం 49 మార్కులు మాత్రమే దక్కాయి. కీలకమైన అంశాల్లో బాగా వెనుకబడినట్లు ఎన్ఐఆర్ఎఫ్ నివేదిక స్పష్టం చేస్తోంది.

ర్యాంకులే కీలకం..

దేశంలోని అన్ని విశ్వ విద్యాలయాల పనితీరు, అభివృద్ధికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు గీటురాళ్ల వంటివి. వీటి ఆధారంగానే అడ్మిషన్లు, నిధులు, ప్రాజెక్టుల కేటాయింపు ఉంటుంది. ర్యాంకులో వెనకబడితే నిధులు ఇవ్వడానికి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కూడా ఆసక్తి చూపదు. వర్సిటీ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రస్తుతం సాధించిన ర్యాంకు గొడ్డలి పెట్టువంటిదని వర్సిటీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితులో రెండేళ్లగా పెద్ద గా పరిశోధనలకు పెద్దపీట పడలేదన్న ఆరోపణలు విని పిస్తున్నాయి. వర్సిటీలో కొత్త పరిశోధనలు జరగలేదని వాస్తవం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పూర్తిగా తెలుసు. ఈ పరిస్థితుల్లో (మిగతా 8వ పేజీలో)

అన్నీ అటువంటి ఆదేశాలే..

జగన్ ప్రభుత్వంలో నియమితులైన ఇన్‌చార్జి వీసీ నిర్ణయాలు అన్నీ తీవ్ర వివాదాలకు కారణమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న రూ.కోట్ల నిధులను పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులకు కేటాయించకుండా, కేవలం తిరుపతికి మాత్రమే కేటాయించి దుర్వినియోగపరుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆర్థిక కమిటీ లేకుండానే నిధులు కేటాయించడం వంటి వ్యవహారాలు కూడా వివాదాలకు కారణమవుతున్నాయి.



ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్టు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి.

ఎరువులు ఏమవుతున్నాయ్

ఇటీవల వరకు వర్షాభావ పరిస్థితుల్లో సాగు సాగ లేదు. ఇటీవల వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అయితే సాగు పనుల్లో నిమగ్నమవ్వాల్సిన రైతులు ఎరువులు కోసం ఎగబడుతున్నారు. అధికారులు పుష్కలంగా యూరియా నిల్వలు ఉంటున్నాయి అంటున్నారు. అయితే ఎక్కడికక్కడ యూరియా అందక రైతులు అల్లాడు తున్నారు. వంద బస్తాలు వచ్చాయంటే పదిం తలుగా రైతులు పోటెత్తు తున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించినా ఒక్క బస్తా కూడా దొరకడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారం పంపిణీ చేసిన యూరియా, ఉన్న నిల్వలకు సాగు అయిన విస్తీర్ణానానికి పొంతనే లేదు. అయితే వచ్చిన యూరియా ఏమైంది.. ఎటు పోయింది.. అనేది తెలియడం లేదు. అధికారులు ఎక్కడికక్కడ నిఘా, తనిఖీలు, టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేసినా ఎరువులు ఏమయ్యాయో ఎక్కడ ఉన్నాయో తెలుసుకోలేక పోతున్నారు. రైతులు మాత్రం యూరియా దొరక్క పాలుపోని పరిస్థితుల్లో చిక్కుకున్నారు.

యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

- సాగు విస్తీర్ణం అంతంతే..
- విపరీతంగా డిమాండ్
- ప్రభుత్వ ప్రకటనలకు.. పొంతనలేని క్షేత్రస్థాయి పరిస్థితులు

(నరసరావుపేట, దాచేపల్లి, బాపట్ల, రేపల్లె - ఆంధ్రజ్యోతి)

దాదాపు రెండు వారాలుగా అన్నదాతల యూరియా ఇక్కట్లపై చర్చ జరుగుతూనే ఉంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద క్యూల్లో రైతులు కనిపిస్తున్నారు. యూరియా సమృద్ధిగా ఉందని అధికారులు ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం అయిన దాఖలాలు కనిపించడం లేదు. వరి పైరు ముంపు బారిన పడడం వల్ల రైతులు వెంటవెంటనే యూరియా చల్లాల్సి వచ్చిందని అందుకు తాత్కాలికంగా సమస్య తలెత్తిందని పది రోజుల క్రితం (మిగతా 8వ పేజీలో)



రేపల్లె : నల్లూరుపాలెంలో ఎరువుల కోసం స్లిప్‌లు రాయించుకుంటున్న రైతులు

అక్రమ రవాణాపై నిఘా



పొందుగల వద్ద కలెక్టర్, ఎస్పీ అర్ధరాత్రి తనిఖీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లా సరిహద్దుల నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా రవాణా అవుతున్న నేపథ్యంలో అధికారులు దృష్టి సారించారు. సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా ఏర్పాటు చేశారు. యూరియా విక్రయాలపై కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి వీరిద్దరూ వారి వాహనాల్లో కాకుండా ప్రైవేటు వాహనాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాష్ట్ర సరిహద్దులోని పొందుగల చెక్‌పోస్టు వద్ద రాత్రి 10.30 నుంచి అర్ధరాత్రి దాటేవరకు వారు స్వయంగా అన్ని వాహనాల్లోనూ తనిఖీ చేశారు. ఆ తర్వాత దాచేపల్లిలో ఎరువులు నిల్వ చేసిన గోదాముల్లో కూడా సోదాలు చేశారు. శుక్రవారం తెల్లవారు జాము 2.30 గంటల వరకు ఈ తనిఖీలు సాగాయి.

● ఆందోళన వద్దు : కలెక్టర్ అరుణ్‌బాబు

యూరియా అక్రమాలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు స్పష్టం చేశారు. అనవసర ఆందోళనలతో అవసరానికి మించి యూరియా కొనుగోళ్లకు రైతులు దూరంగా ఉండాలని సూచించారు.

● ఎరువుల అక్రమాలపై పీడీ యాక్టు :ఎస్పీ శ్రీనివాసరావు

యూరియా అక్రమ నిల్వ చేసినా, అక్రమాలకు పాల్పడినా సంబంధితులపై ఏకా, పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. పొందుగల, తంగెడ, నాగార్జున సాగర్ చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.

యూట్యూబ్ చూసి.. చోరీల్లో ఆరితేరాడు

● నెలన్నరలో కార్ల అద్దాలు పగలగొట్టి 18 దొంగతనాలు ● 10 కేసులు నమోదు...నిందితుడు నరసరావుపేట రౌడీషీటర్ బాజీ ● వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్

దురంతో ఎక్స్‌ప్రెస్‌కు రెండు స్లీపర్ క్లాస్ బోగీలు

రైలుకు ఎదురెళ్లి.. వ్యక్తి ఆత్మహత్య

2 కేజీల గంజాయి స్వాధీనం 6

● పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

అర్ధరాత్రి హాస్టల్‌లో తనిఖీలు

ఎస్పీతో కలిసి కలెక్టర్ ఆకస్మిక సందర్శన

దాచేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తోటి విద్యార్థిలపై దాడి చేస్తూ వైరల్‌గా మారిన దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని బాలుర హాస్టల్‌ను గురువారం అర్ధరాత్రి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిద్రలో ఉన్న విద్యార్థులను లేపి మరీ కలెక్టర్, ఎస్పీ వారితో కొద్దిసేపు మాట్లాడారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు తనిఖీకి వెళ్తూ ఎటువంటి హడావుడి లేకుండా వచ్చిన కలెక్టర్, ఎస్పీలను చూసిన విద్యార్థులు తొలుత ఆశ్చర్యపోయారు. అర్ధరాత్రి వేళ హాస్టల్‌కు కలెక్టర్, ఎస్పీ రావడం విద్యార్థులను విస్మయానికి గురిచేసింది. హాస్టల్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య, ఉన్న వారి సంఖ్యను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు, దాచేపల్లి ఏవో వెంకటేశ్వర్లు తదితరులు వారి వెంట ఉన్నారు.



బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావులు

పశు వైద్యం.. బహు దూరం

వినుకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో లేని పశువైద్యంతో పాడి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రతికూల వాతావరణ పరిస్థితులతో సాగులో నష్టాలు చవిచూసిన రైతులు పశుపోషణపై దృష్టి పెట్టారు. గేదెలు, ఆవులుతో పాటు గొర్రెలు, మేకల పెంపకం ద్వారా పాల ఉత్పత్తిలో ఆదాయాన్ని పొందుతున్నారు. అయితే కాలానుగుణంగా వచ్చే వ్యాధులతో పశువులు తరచూ వ్యాధుల బారిన పడుతున్నాయి. పశు సంపదకు సరిపడా వైద్యశాలలు అందుబాటులో లేవు. ఉన్న వైద్యశాలల్లో సిబ్బంది కొరతతో సకాలంలో పశువులకు వైద్యం అందక పశు పెంపకందారులకు ఆర్థికంగా కోలుకోని నష్టం వాటిల్లు తుంది. వినుకొండ మండలంలోని 28 పంచాయతీలకు పిట్టం బండలో మాత్రమే పశు వైద్యశాల ఉంది. వ్యాధులు బారి న పడినప్పుడు ఎటుచూసినా సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి పశువులను చికిత్సకు తీసుకురావాలంటే పోషకులకు తలకుమించిన భారంగా మారుతోంది. వినుకొండలో పశు ఏరియా వైద్యశాల ఉన్నా అక్కడికి వచ్చే పశువులకు చికిత్స అందించడానికి సిబ్బందికి సమయం సరిపోతుంది. నూజెండ్ల మండలంలో 27 గ్రామపంచా యతీలకు ఒకటే పశువైద్యశాల ఉంది. ఇక్కడ సుమారు 20, 30 కిలోమీటర్ల దూరం నుంచి మండల కేంద్రానికి పశువులను తీసుకురావాల్సి వస్తోంది. నూజెండ్లలోని ఒక్క ఆస్పత్రి మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. బొల్లాపల్లి మండలంలో బొల్లాపల్లి, గుమ్మనంపాడు, ఈపూరు మండలంలో కొచ్చర్ల, శావల్యాపురం మండలంలో కారుమంచిలలో ఆసుపత్రులు ఉన్నప్పటికీ వైద్యులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



వినుకొండ ఏరియా పశు వైద్యశాల

గురుదేవోభవ

104 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయుల సేవలను కీర్తించిన కలెక్టర్, ఎస్పీ, ఎంపీ ● ఘనంగా గురుపూజోత్సవం

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చూపిన ప్రతిభా పాటవాలను కీర్తిస్తూ.. విద్యార్థులను తీర్చిదిద్దుతోన్న వైనాన్ని విశ్లేషిస్తూ.. హర్షధ్వానాల మధ్య సత్కరిస్తూ.. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతు తానీస్థాయికి రావడానికి ప్రధాన కారణం తనకు చదువు చెప్పిన గురువులేనన్నారు. సమాజం, తల్లిదండ్రుల తర్వాత అంతటి ఉన్నత స్థానాన్ని ఇచ్చింది గురువుకే అని చెప్పారు. అనంతరం ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు తమకు చదువు చెప్పిన గురువులను స్మరించుకంటూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. అనంతరం జిల్లాకు చెందిన 104 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందుగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సెలవు రోజు కావడంతో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, గుంటూరు ప్రాంతీయ విద్యా సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి, శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ సాంస్కృతిక సంస్థ చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులా రెడ్డి, ఎన్.ఎస్.ఆర్.సి. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ డైరక్టర్ మద్దిరాల గంగాధర్, రజక సంఘం డైరక్టర్ గుఠ్రపుశాల రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ సాతులూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీ శ్రీకృష్ణదేయరాయలు,ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

దేశానికే ఆదర్శం.. ఆరోగ్య బీమా: చీఫ్ విప్ జీవీ

వినుకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ పేదల పాలిట సంజీవని కానుందని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బు లేక చికిత్సలు అందుకోలేని పరిస్థితుల్లో ఇకపై ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఉండవని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెడుతున్న ఈ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సుమారు 1.63 కోట్ల కుటుంబాలు, 5 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం అందించనున్న అందరికీ ఆరోగ్య బీమా వంద శాతం గేమ్ చేంజర్ అవుతుందని పేర్కొన్నారు. రూ.25 లక్షల వరకు పరిమితి ఉండడం వల్ల ఇకపై ఖరీదైన వైద్య సేవలకు ఎవరూ భయపడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. చిన్న జ్వరం నుంచి గుండె ఆపరేషన్లు, డయాలసిస్, క్యాన్సర్ చికిత్సల వరకు నూతన విధానంలో విస్తృత కవరేజీ అందిస్తారని తెలిపారు. రాష్ట్రం మొత్తం దాదాపు 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 3,257 పైగా వైద్య సేవలు రూపాయి ఖర్చు పెట్టకుండానే అందుతాయన్నారు. ఆస్పత్రుల్లో చేరిన 6 గంటల్లోనే క్యాష్‌లెస్‌కు అనుమతులు ఇస్తారన్నారు. రైతుల ముసుగులో యూరియాపై వైసీపీ, జగన్ చేస్తున్న ఫేక్ ప్రచారాల్ని ఎవరు నమ్మడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్రం అదనంగా 53 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందని, ఆ నిల్వలు రైతులకు చేరేలోపు రాజకీయ లబ్ధికి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో భూ అక్రమాలు

లేని భూమిని ప్రభుత్వానికి అప్పగించి నిధులు డ్రా: బీజేపీ నేత రమేష్

వినుకొండటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో వైసీపీ నాయకులు భూ అక్రమాలకు పాల్పడినట్లు బీజేపీ సీనియర్ నాయకుడు మేడం రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధి.. జాలలపాలెం పంచాయతీలో ఈ అక్రమాలు జరిగినట్లు తెలిపారు. సర్వే నంబరు 113/3లో 3.63 ఎకరాలు, 60-17/1ఏలో ఎకరం 20 సెంట్లు మొత్తం 4.83 ఎకరాలను 1995లో విజయవాడలోని మూల్పూరి ఆగ్రో టెక్‌కు చెందిన యజమానులకు విక్రయించారని తెలిపారు. అదే సర్వే నంబర్లలోని భూమిని 2020లో వైసీపీ పెద్దల సాయంతో ప్రభుత్వానికి విక్రయించి, రూ.80 లక్షలు అక్రమంగా అర్జించారని పేర్కొన్నారు. ఈ నెల 3న సీసీఎల్ చీఫ్ కమిషనర్ శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారన్న అంశం వెలుగులోకి రావడంతో వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందని తెలిపారు. జగనన్న కాలనీలకు భూములు అప్పగించిన వారి వివరాలు ప్రభుత్వం వెలికి తీస్తే వైసీపీలోని కొందరు పెద్దల అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

తుంగభద్రలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం



తేలాడుతున్న మృతదేహం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణం నుంచి ప్రవహించే తుంగభద్ర డ్రెయిన్‌లో శుక్రవారం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం తుంగభద్ర డ్రెయిన్‌లో గుర్తుతెలియని యువకుడి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీసి తీశారు. గుర్తుతెలియని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వైసీపీ హయాంలో సొసైటీ అక్రమాలపై సమగ్ర విచారణ

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్రస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. పచ్చలతాడిపర్రు ప్రాథమిక వ్యవసాయ పరిమితి సంఘం నూతన కార్యవర్గ ప్రమణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా జనసేన నాయకుడు గంధం సురేంద్ర, సభ్యులుగా పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యంపరాల గోపీకృష్ణ, కట్టెంపూడి గ్రామస్తుడు యక్కటి నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో దండమూడి గ్రామంలో ఎన్నో రకాల విధ్వంసానికి తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతిపక్ష నాయకులు వినాయక నిమజ్జనాలను కూడా చేసుకోవడానికి వీల్లేకుండా ఆటంకాలు కలిగించారని దుయ్యబట్టారు. పోలీసులను పెట్టి బెదిరింపులకు పాల్పడి, అక్రమ కేసులు బనాయించి.. వేధింపులకు గురిచేసినా జనసేన, టీడీపీ నాయకులు వాటిని ఎదుర్కొన్నారని ప్రశంసించారు. తేనె పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న గంధం సురేంద్ర ఆర్థిక మూలాల మీద దెబ్బ తీయాలని చూశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో బోగస్ డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి, అక్రమ మార్గంలో రుణాలు తీసుకున్నారని విమర్శించారు. సొసైటీల్లో రైతుల పేర్ల మీద రుణాలు తీసుకొని.. కోట్ల రూపాయలు కొల్లగొట్టి అక్రమార్కులను కఠినంగా శిక్షిస్తామని ధూళిపాళ్ల స్పష్టం చేశారు. పచ్చలతాడిపర్రు సొసైటీ అధ్యక్షులుగా ఉన్నవారు ఉన్నత పదవులు చేపట్టారని గుర్తుచేశారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా.. పంట రుణాలు సకాలంలో అందించడంతోపాటు ఎరువులు సరఫరా చేసి వారి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా దండమూడి సొసైటీకి అత్యంత పిన్న వయస్కుడు సురేంద్రను అధ్యక్షుడిగా నియమించడంపై ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సురేంద్రకు పదవి రావడంతో కొంతమంది అసంతృప్తి వాదులు అతనిపై అసత్యాలు ప్రచారం చేశారని సురేంద్ర వాటిని రైతు సేవ ద్వారా ఎదుర్కోవాలని సూచించారు. అతిథుల సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను, ముఖ్య అతిథులను జనసేన నియోజకవర్గ నాయకులు ఘనంగా సత్కరించారు. కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1.0820 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 3 గేట్లను 1.5 మీటర్లు, ఒక గేట్‌ను మీటర మేర ఎత్తి 25,490 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 8,600.. మొత్తం 34,099 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0820 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 (పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 (పూర్తి స్థాయి) టీఎంసీలకు సమానమని తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 7,029, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 52,115 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 52,115 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

స్వల్పంగా వరద ఉధృతి



స్పిల్ వే ద్వారా నీరు విడుదల

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతో పాటు, కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 26,298 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 10,076, పశ్చిమ డెల్టాకు 8,004, గుంటూరు చానల్‌కు 148 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

యువత భుజస్కందాలపైనే భారత ఉజ్వల భవిష్యత్తు

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): దేశ ఉజ్వల భవిష్యత్తు యువత భుజస్కందాలపై ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏటుకూరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నలంద, తక్షశిల వంటి విశ్వ విద్యాలయాల ద్వారా ప్రపంచ మానవాళికి జ్ఞాన మందించిన ఘనమైన మన భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోవు రోజుల్లో విద్యా వ్యవస్థలో సంస్కరణల ద్వారా పెను మార్పులను ప్రతి ఒక్క విద్యార్థి ఆకళింపు చేసుకుంటూ వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడిపించే వారే గురువు అన్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఏ వృత్తిలో రాణించాలన్నా.. గురువుల పాత్ర అమూల్యమైనదన్నారు. భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జీవితంలో ఎంతో సాధించిన.. ప్రేరణాత్మకమైన వ్యక్తులను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. వారి అనుభవసారాన్ని వినమ్రంగా గ్రహించి లక్ష్యసాధనకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన



మాట్లాడుతున్న కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కులగణన పూర్తిచేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలను ఇచ్చిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో నేటికీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం తేల్చకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కులగణన ప్రక్రియను పూర్తిచేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పారేపల్లి మహేశ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులు కేటాయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిధులు వస్తాయని ఆశపడ్డామని తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, కోశాధికారి కన్నా మాస్టారు, నేతలు పాల్గొన్నారు.

రైలుకు ఎదురెళ్లి.. వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొలకలూరు - దుగ్గిరాల రైల్వేస్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని తెనాలి జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి శుక్రవారం తెలిపారు. రైలు దుగ్గిరాల స్టేషన్ దాటి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ట్రైన్‌కు ఎదురెళ్లాడు. రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రైలు డ్రైవర్ సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఎస్ఐ పరిశీలించారు. మృతుడి శరీర భాగాలు రైల్వే ట్రాక్ వెంట వివిధ ప్రాంతాల్లో పడి ఉండటం గుర్తించారు. మృతుడుకి.. 45-50 సంవత్సరాల వయస్సు ఉంటుందని కాటన్ లుంగీ, ఎరుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకటాద్రి వివరించారు.

యూట్యూబ్ చూసి.. చోరీల్లో ఆరితేరాడు

● నెలన్నరలో కార్ల అద్దాలు పగలగొట్టి 18 దొంగతనాలు
● 10 కేసులు నమోదు...నిందితుడు నరసరావుపేట రౌడీషీటర్ బాజీ
● వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్, పక్కన సౌత్ డీఎస్పీ భానోదయ, సీఐ వంశీధర్

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూట్యూబ్‌లోని చోరీ వీడియోలు చూసి.. కారు అద్దాలు పగలగొట్టి ఎలా నేరాలు చేయాలో నేర్చుకున్న ఓ రౌడీషీటర్ అదే తరహాలో వరుస నేరాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిరాడు. గుంటూరు నగరంలోనే నెలన్నరలో 18కి పైగా నేరాలకు పాల్పడ్డాడు. అయితే అందులో చాలా నేరాల్లో డాక్యుమెంట్లు, అతి తక్కువ మొత్తంలో నగదు పోవడంతో అవి కేసులు నమోదుకు దారి తీయలేదు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సౌత్ డీఎస్పీ భానోదయ ఆధ్వర్యంలోని బృందం.. వరుస నేరాలకు పాల్పడుతోన్న నిందితుడికి చెక్ పెట్టారు. సీసీ కెమెరా ఫుటేజీలతోపాటు ఇతర సాంకేతిక ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడిని నరసరావుపేట క్రిస్టియన్‌పేటకు చెందిన రౌడీషీటర్ జంగం బాజీగా గుర్తించారు. బాజీని అరెస్ట్ చేసి.. అతని నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, 11 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్ కుమార్ నిందితుడు బాజీని మీడియా ఎదుటి హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. నరసరావుపేటలోని క్రిస్టియన్ పేటకు చెందిన జంగం బాజీ తన సోదరుని చంపిన వ్యక్తులను హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అతని రౌడీషీట్ కూడా ఉంది. బాజీ వ్యసనాలకు బానిసై డబ్బులు కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అత్యంత చాకచక్యంగా రెప్పపాటులో కారు అద్దాలు పగలగొట్టి అందులో ఖరీదైన వస్తువులు, బ్యాగులు, లాప్‌ట్యాప్‌లు అపహరిస్తున్న హైటెక్ దొంగగా మారాడు. అతని సొంతూరు నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామం. గుంటూరు నగరంలోనే 18 వరకు కారు అద్దాలు పగలగొట్టి చోరీలు చేసిన నేరాలకు పాల్పడ్డాడు. అందులో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, నగరంపాలెంలో మూడు, పెదకాకాని, పాత గుంటూరు, అరండల్ పేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం పది కేసులు మాత్రమే నమోదు అయ్యాయి.

యూట్యూబ్ చూసి..ఆరితేరి..!

బాజీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి పోలీసులకు దొరకకుండా ఎలా తప్పించుకోవాలో... నేర్చుకున్నాడు. హెల్మెట్ ధరించి, చేతులకు గ్లౌజులు వేసుకొని నేరాలకు చేయసాగాడు. ముఖ్యంగా పార్కింగ్ స్థలాల్లో పెట్టిన కార్లను టార్గెట్ చేస్తాడు. గులకరాయితో కారు అద్దం పగలగొట్టి అందులో ఉన్న లాప్‌ట్యాప్‌లు, బ్యాగులు, నగదు వంటి వస్తువులను చిటికలో మాయం చేస్తాడు. శివారు ప్రాంతాల్లోని ఏటీఎం సెంటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, బ్యాంకులు తదితర చోట్ల పార్కింగ్ చేసిన కార్లను, యజమానులను గుర్తించి వారు ఎక్కడికి వెళ్తున్నారో గమనించి ఆ తర్వాత నేరానికి పాల్పడతాడు. బాజీ గతంలో నరసరావుపేట పరిసర ప్రాంతాల్లోనూ ఇతర నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో నల్లపాడు పోలీసులు నిందితుడు బాజీ చెప్పిన వివరాలు ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఈ తరహా నేరాల గురించి ఆరా తీస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల అత్యధిక నేరాల్లో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలే పోలీస్ శాఖకు ఉపయోగపడుతున్నాయన్నారు. బాజీని అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్ కుమార్ అభినందించి రివార్డులు ప్రకటించారు. సీఐ వంశీధర్, ఎస్ఐ వాసు, సీసీఎస్ సీఐ అనురాధ, నల్లపాడు హెడ్ కానిస్టేబుల్ కె.సుబ్బారావు, కానిస్టేబుళ్లు భిక్షు నాయక్, షేక్ మస్తాన్ వలి, టి.సాంబశివరావు తదితరులకు ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు.

తుప్పు పట్టి పోవాల్సిందేనా?



ఫుట్‌ఫాత్‌పై పడవేసిన గడ్డర్లు

తెనాలిఅర్బన్,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చందోలు -తెనాలి ప్రధాన రహదారిలో వైకుంఠపురం వద్ద ఫుట్‌పాత్‌పై వేసిన గడ్డర్లు తుప్పు పట్టి పోతున్నాయి. ఇక్కడ ఉన్న రైల్వే ట్రాక్ రక్షణకు ఇరువైపులా అధిక లోడు లారీలు, ఇతర వాహనాలు నివారించేందుకు ఈ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అయినా.. కొందరు భారీ వాహన డ్రైవర్లు దీనిని పట్టించు కోకుండా.. ఈ మార్గంలో వెళ్లడంతో..వాహనాలు గడ్డర్లకు తగిలి ఇరుక్కుపోతున్నాయి. ఇలా పలుమార్లు గడ్డర్లు దెబ్బతిన్న ఘటనలు ఉన్నాయి. దెబ్బతిన్న గడ్డర్లను తొలగించి ఫుట్‌పాత్‌లపై పడేశారు. కొద్దిగా దెబ్బతిని వీటిని మరమ్మతులు చేయించి ఉపయోగించకుండా.. ఇలా నిరుపయోగంగా పడేశారు. రైల్వే అధికారులు స్పందించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌కు రెండు స్లీపర్ క్లాస్ బోగీలు

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజులు గుంటూరు మీదగా ప్రయాణించే 22204/22203 సికింద్రాబాద్ - విశాఖపట్నం- సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్‌కి రెండు స్లీపర్ క్లాస్ బోగీలను జోడించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ నెల 20 నుంచి సికింద్రాబాద్ వైపున, 21 నుంచి విశాఖపట్టణం వైపున ఈ స్లీపర్ క్లాస్ బోగీలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే అడ్వాన్స్ రిజర్వేషన్‌ని కూడా రైల్వే శాఖ ప్రారంభించింది. సికింద్రాబాద్‌లో ప్రతీ సోమ, బుధ, శనివారం రాత్రి 8.15 గంటలకి, విశాఖపట్నంలో మంగళ, గురు, ఆదివారాల్లో రాత్రి 7.50 గంటలకు ఈ రైలు బయలుదేరుతుంది.

అట్టహాసంగా డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. నాజ్ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్లో జరిగిన వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని డేగల ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు, అభిమానులతో కలిసి ప్రభాకర్ కేక్ కట్ చేశారు. డేగల యూత్, మిత్రమండలి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించి వృద్ధులకు చీరలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, అన్నదానం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం, అంధ పాఠశాల విద్యార్థులకు మందులు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. సుమారు 70 మంది యువకులు రక్త దానం చేశారు. ముందుగా నాజ్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా బాణ సంచా పేల్చి.. సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రలువురు నాయకులూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయడంలో ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఛైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నామినేటెడ్ పదవులు ఇచ్చి తనలాంటి యువతకు ప్రోత్సాహం ఇచ్చారన్నారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల కేంద్రాల్లో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహా ముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 0404 1896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

2 కేజీల గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

పెదకాకాని, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులు గంజాయి కలిగిన ఆరుగురు నిందితులను అదుపులో తీసుకున్నారు. శుక్రవారం రాత్రి పెదకాకానిలోని జాకీర్ హుస్సేన్ నగర్‌కి చెందిన వీరి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం నుంచి రైలు మార్గం ద్వారా గంజాయిని వీరు తీసుకొచ్చారు. సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టి నిందితులను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

కుంకలగుంటలో అప్రకటిత విద్యుత్ కోతలు

నకరికల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రెండు మూడు రోజుల నుంచి రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఒకవైపు వర్షాకాలం, పగటిపూట పనులు చేసి రాత్రి దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు తెల్లవారితే గాని విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం లేదు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతలను నివారించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లోని శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జ్ ఏఈ భగవాన్ నాయక్ శుక్రవారం తెలిపారు. మాచవరం, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో 11కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

మిలాద్ ఉన్ నబీ ప్రార్థనలు

రెంటచింతల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ముస్లింలు శుక్రవారం మండలంలో 13 మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత పెద్దలు షఫీ, మహ్మద్ ఖాసిం, ఇలియాస్ తదితరులు భక్తులకు పలు బోధనలు చేశారు.

● బెల్లంకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బెల్లంకొండలోని ముస్లిం సోదరులు శుక్రవారం మిలాద్ ఇన్ నబీ వేడుకలను జరుపుకున్నారు. అదే విధంగా నందిరాజుపాలెం, వన్నాయపాలెం, పాపాయపాలెం, న్యూ చిట్యాల ఆర్అండ్ఆర్ సెంటర్ గ్రామాల్లో మిలాద్ ఇన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మదర్‌థెరిస్సాకు ఘన నివాళి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాల వద్ద మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాదె కిరీటిరెడ్డి, సభ్యులు చిలమకూరి నాగిరెడ్డి, కసిరెడ్డి శాంతిరెడ్డి, అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అందుగుల బాలజోజి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా రత్తయ్య

సత్తెనపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా కాపుగంటి రత్తయ్యను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఏజీకేఎం కళాశాలలో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రత్తయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, పోతుగంటి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపూరికి పదవిపై హర్షం

క్రోసూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలానికి చెందిన ఏపూరి నాగేశ్వరరావుకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ పదవి లభించటంపై పలువురు నియోజకవర్గ టీడీపీ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాంగ్రు కాశయ్య, డాక్టర్ మహహ్మద్ షరీఫ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, మండల టీడీపీ అధ్యక్షులు మొగల్ జాన్, తదితరులు హర్షం చేశారు.

మాచర్లలో ఫీవర్ సర్వే



ప్రభుత్వాసుపత్రిలో రోగుల వివరాలను సేకరిస్తున్న మలేరియా సిబ్బంది

మాచర్లటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. అన్ని వార్డుల్లో ఆరోగ్య కార్యకర్తలు, మలేరియా సిబ్బంది ఇంటింటి సర్వే జరిపారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలను సందర్శించి జ్వర పీడితులను గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ మురళీధర్, బి.వాగ్యానాయక్, కేఎన్ నాయక్, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుకు ఎంపీడీవోగా పదోన్నతి



సీహెచ్ శ్రీనివాసరావు

రెంటచింతల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండల ఈవోపీఆర్డీ (ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావుకు ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన 38 సంవత్సరాల నుంచి పీఆర్ విభాగంలో పనిచేస్తూ మేజర్ పంచాయతీ రెంటచింతలకు 2013 నుంచి రెండేళ్ల పాటు కార్యదర్శిగా పనిచేశారు. 2015 అక్టోబరు నుంచి ఈవో పీఆర్డీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ప్రస్తుతం రెంటచింతలకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కూడా వ్యవహరిస్తున్నారు.

పిడుగురాళ్లలో పారిశుధ్య చర్యలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న వైరల్ ఫీవర్లపై ఆంధ్రజ్యోతి సంచికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట సైడ్ డ్రైన్స్‌తో పాటు పలు ప్రాంతాలలోని కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లించారు. కమిషనర్ ఐ.శ్రీనివాసులు పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.



పిడుగురాళ్ల ఎంపీడీవో కార్యాలయం సమీపంలో కాల్వలో చెత్తను తొలగిస్తున్న కార్మికుడు, బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



దుర్గి: అవార్డు అందుకుంటున్న హెచ్ఎం గోవిందరాజులునాయక్



దాచేపల్లి: ఉత్తమ ఉపాధ్యాయుడు ఎం.రాజశేఖర్‌ను అభినందిస్తున్న ఎంఈవో పినాకపాణి



రెంటచింతల: అమలబాబును సన్మానిస్తున్న కలెక్టర్ పి.అరుణబాబు తదితరులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా పిడుగురాళ్ల మండలంలో జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శుక్రవారం నరసరావుపేటలో డీఈవో చంద్రకళ, ఎమ్మెల్యే అరవింద్‌బాబు, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు సత్కరించారు. ఉపాధ్యాయులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, సీహెచ్ సుబ్బరామయ్య, జి.పుల్లారావు, జి.సైదారెడ్డి, ఆర్.కోటేశ్వరరావు, ఎం.రక్షణ, సీహెచ్ దుర్గాప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు.

● దుర్గి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో బెంజిమెన్ తెలిపారు. హెచ్ఎం గోవిందరాజులునాయక్, వై.శ్రీనివాసరావులు నరసరావుపేటలో జరిగిన వేడుకల్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవింద్‌బాబు, కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకున్నారన్నారు.

● దాచేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలో ఎం.రాజశేఖర్, నాగండ్ల ఏసయ్య ఉత్తమ ఉపాధ్యాయులుగా కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డులను అందుకున్నారు.

● రెంటచింతల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలం నుంచి ఉత్తమ టీచర్లుగా ఎంపికైన కె.అమలబాబు, బి.సౌజన్యలు నరసరావుపేటలో కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారు.

● ముప్పాళ్ళ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లవరం హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలు కన్నా మంజుల నరసరావుపేటలో జరిగిన గురుపూజోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును కలెక్టర్ అరుణబాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, డీఈవో చంద్రకళ నుంచి అవార్డును అందుకున్నారు.

● మాచవరం: మాచవరం డీడ్వ్యూ హెచ్ఎం జయప్రద, గంగిరెడ్డిపాలెం దళిత వాడ ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంగాధరరావు, మోర్జంపాడు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడి పనిచేస్తున్న రమేష్ బాబులకు నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబు, జిల్లా అధికారులు సన్మానం చేశారు.

● పెదకూరపాడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన రాయపూడి సాంబశివరావును శుక్రవారం సత్కరించారు. నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు, జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ తదితరులు సన్మానించారు.

● అచ్చంపేట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక మండలంలోని కోనూరులో పనిచేస్తున్న గంధం గంగయ్య, నీలేశ్వరపాలెంలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న నంద్యాల శివకుమారిలను సత్కరించారు.

● క్రోసూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా క్రోసూరు మండలంలోని నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. పీసపాడులో పని చేస్తున్న దొప్పలపూడి వెంకటేశ్వరరావు, అందుకూరు హైస్కూల్‌కు చెందిన డీ ధర్మారావు, ఎలిమెంటరీకి చెందిన కాకర్ల గంగాధర్, బయ్యవరం హైస్కూల్ హిందీ పండిట్ పీ గంగా జ్యోతిలకు కూడా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి.



మాచవరం: హెచ్ఎం జయప్రదకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, జిల్లా అధికారులు



పెదకూరపాడు: సాంబశివరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరవింద బాబు, గంగాధర్, చంద్రకళ

ఘనంగా వినాయక నిమజ్జనం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను పూర్తిచేసుకుని గుంటూరు నుంచి ఉగ్రనరసింహ గణనాథుడి భారీ విగ్రహం నిమజ్జన కార్యక్రమానికి అమరావతి తీసుకువచ్చారు. ఉగ్రనరసింహ అవతారం పక్కన విఘ్నేశ్వరస్వామి ఉన్న ఈ విగ్రహంను చూసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చారు.

● క్రోసూరు: క్రోసూరులోని విద్యానగర్ వినాయకుని నిమజ్జనోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహం వద్ద లడ్డూను విద్యానగర్‌కు చెందిన మక్కెన గోవర్ధన్ రూ.1.17లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. మండలంలోని అందుకూరులో గణనాథుని నిమజ్జనం చేశారు.

● రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిలో వినాయకుని నిమజ్జనం నేత్ర పర్వంగా సాగింది. ఈ ఉత్సవాల్లో వివేకా టెక్నోస్కూల్ యాజమాన్యం, డైరెక్టర్ జె.కృష్ణారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన సినీ యాక్టర్ల వేషధారులు సందడి చేశారు.

● విజయపురిసౌత్: స్థానిక డౌన్ మార్కెట్‌లో మత్స్యకారుల యువసేన ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో స్వామి వారికి నివేదించిన లడ్డూ ప్రసాదానికి శుక్రవారం వేలం నిర్వహించగా రూ.లక్షకు ఓసుపల్లి అంజి దక్కించుకున్నారు. అలాగే యలక్కాయను రూ.57వేలకు సొరడా అశోక్, రూ.200ల కరెన్సీ దండను యజ్జల తాతీలు రూ.45వేలకు, రూ.100ల కరెన్సీ దండను యజ్జల రగ రూ.30వేలకు, రూ. 50ల దండను షైలపల్లి అప్పారావు రూ.33వేలకు, రూ.10ల దండను బంగారు చిట్టి రూ.23వేలకు, కలశాన్ని చెల్లూరి రాజు రూ.36వేలకు, స్వామివారి హుండీని షైలపల్లి నారాయణ రూ.30వేలకు దక్కించుకున్నారు. అలాగే డౌన్ మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి గుడి వద్ద భజరంగదళ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లడ్డును షైలపల్లి అప్పలరాజు రూ.35వేలకు దక్కించుకున్నారు. అనంతరం విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి కుడికాలువలో నిమజ్జనం చేశారు.

● అచ్చంపేట: మండల కేంద్రమైన అచ్చంపేటలో గణనాథుడిని శుక్రవారం నిమజ్జనోత్సవానికి తరలించారు. అచ్చంపేటలో ఘనంగా డప్పు డ్యాన్స్‌లతో చామర్రు కృష్ణానదికి తరలించి నిమజ్జనం చేశారు.

అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలి

● ఏడీఏ మస్తానమ్మ

క్రోసూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవసరం మేరకే రైతులు యూరియా కొనుగోలు చేయాలని క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ, వ్యవసాయ అధికారి వేణుగోపాల్ కోరారు. క్రోసూరు డీసీఎంఎస్‌లో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీని వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంట కాలం మొత్తానికి ఒకేసారి యూరియా కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్నారని, అలా చేయటం వలనే సకాలంలో అందించలేక పోతున్నామన్నారు. ఇప్పటి వరకు మండలంలో 579 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయటం జరిగిందన్నారు. డీసీఎంఎస్ ద్వారా 175, సొసైటీల ద్వారా 60, రైతు సేవా కేంద్రాల 20, ప్రైవేట్ డీలర్ల ద్వారా 324 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు.



యూరియా పంపిణీని పర్యవేక్షిస్తున్న వ్యవసాయ అధికారులు

పాల రైతులకు రూ1.5లక్షల బోనస్ పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) సంగం డైయిరీ పరిధిలోని లింగాపురం గ్రామంలోని పాల కేంద్రంలో పాలు పోసే రైతులకు 5శాతం బోనస్‌ను సంగం డైయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం కేంద్రం పరిధిలోని 98మంది ఉత్పత్తిదారులకు బోనస్‌ను అందజేశారు. సంవత్సరంలో 98మంది ఉత్పత్తి దారుల నుంచి 54,858 లీటర్ల పాలు సేకరించి వారికి రూ30.37లక్షల నగదు చెల్లించారు. దీనికి సంబంధించి బోనస్ రూ1,51,877 రైతులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షురాలు ఏపూరి పుష్పావతి, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో ఫ్రైడే, డ్రైడే

రాజుపాలెం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం పులిచింతల పునరావాస కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకులు జీవనరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. అనంతరం పునరావాస కేంద్రంలోని ప్రతి ఇంటిలో ఫీవర్ సర్వే చేశారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూడాలి

● డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బి రవి

నకరికల్లు సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి కోరారు. శుక్రవారం నకరికల్లు మండలం దేచవరం గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆయనతోపాటు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, కుంకలగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చల్లా వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి కొంపల వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



దేచవరంలో తొట్టిలో నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి

గ్రామాల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్ల టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో వసతుల కల్పన, భారీ నిధుల కేటాయింపు సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్‌లకే దక్కుతుందన్నారు. రైతులకు యూరియా దొరకడం లేదని వైసీపీ విషప్రచారం చేస్తోందన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త లక్ష్యంతో చంద్రబాబునాయుడు ప్రభుత్వం కృషి చేస్తోందని యాగంటి మల్లికార్జునరావు అన్నారు.

గణనాథునికి ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రత్యేక పూజలు



లింగంగుంట్ల వినాయకుని విగ్రహం వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లింగంగుంట్లలో జరిగిన వినాయకుని ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం పాల్గొన్నారు. టీడీపీ యువ నాయకులు మేదరమెట్ల సౌమిత్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, మండల టీడీపీ నేతలు పరుచూరి పూర్ణచంద్రరరావు, వడ్లమూడి అప్పారావు, బోడపాటి సుదర్శన్, వీరపనేని మురళీ, గంగినేని లీలావతి, వడ్లమూడి చిన్న, గంగినేని చిన్నపేరయ్య, మద్దినేని వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడిలో రోడ్ల విస్తరణకు రంగం సిద్ధం

కారంపూడి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో ఇరుకైన రోడ్లను విస్తరించడానికి అధికారులు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టబోతున్నారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ ఎండీ సుబ్బారావు నుంచి తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్‌కు ఉత్తర్వులు అందాయి. కారంపూడికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని, రోడ్డు విస్తరించి తగిన డివైడర్లు కూడా ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కారంపూడి నుంచి దాచేపల్లి రహదారి వరకు, నకరికల్లు నుంచి గురజాల రహదారి వరకు, కారంపూడి పట్టణ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి మార్కింగ్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో తెలిపారు. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు స్థానిక ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి మార్కింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకుంటే అధికారులే తొలగిస్తారని వెల్లడించారు.

యూరియాపై ఆందోళన వద్దు

● ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా నిరంతర సరఫరా వుంటుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్ల వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో యూరియా పంపిణీ సజావుగా జరుగుతోందన్నారు. రైతులకు ఇప్పటి వరకు పిడుగురాళ్లలో 1362.99, మాచవరంలో 224.83, దాచేపల్లిలో 252.81, కారంపూడిలో 310.03, నకరికల్లులో 1039.02 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు ఏడీఏ తెలిపారు. పిడుగురాళ్లలో 40.43, మాచవరంలో 3.30, దాచేపల్లిలో 25.38, కారంపూడిలో 51.36, నకరికల్లులో 181.32 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు వున్నాయని ఏడీఏ తెలిపారు. పంటల దశను బట్టి అవసరమైన మేరకే యూరియా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కొందరు రైతులు ముందస్తుగా కొనుగోలుచేసి నిల్వ చేసుకోవద్దని ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు సూచించారు.

ముగిసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ మదార్‌సాహెబ్

మాచర్ల టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ ముఖ్య అతిథిగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు పోకూరి కాశీపతి, పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, ప్రోగ్రాం ఇన్‌చార్జి లక్ష్మి ప్రభావతి, ట్రైనర్ బి.లక్ష్మి, సీవో జ్యోతి పాల్గొన్నారు.

రీ సర్వేలో అన్ని భూముల వివరాలను ఆన్‌లైన్ చేయాలి

● ప్రభుత్వ భూముల లబ్ధిదారుల వేడుకోలు

నకరికల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో పట్టా భూమి, ఈనామ్ భూములను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని అన్ని భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వ భూములు పొందిన పలువురు లబ్ధిదారులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం మొదటి విడత, రెండో విడత ఇలా విడతల వారీగా పేదలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేసింది. నకరికల్లు మండలంలో చేజర్ల, చల్లగుండ్ల, నరసింగపాడు, త్రిపురాపురం, చీమలమర్రి గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల్లో ప్రస్తుతం రీ సర్వే జరుగుతోంది. కాగా ఈ గ్రామాల్లో ప్రభుత్వం భూమి పంపిణీ చేసిన పథకంలో భూమిని సాగు చేసుకుంటున్న లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావటం లేదు. దీంతో గత ఏడాది వరకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు వీరికి అందలేదు.బ్యాంకుల్లో పంటరుణం కూడా మంజూరు కావటంలేదు. దీనిపై రెవెన్యూ అధికారుల నుంచి సరైన సమాధానం రావటం లేదు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూములు పొందినవారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన రైతులు 90శాతానికి పైగా ఉన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూములు రీసర్వేలో నమోదు చేయకపోవటంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించటంతో ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి ఏరియా గౌరవ అధ్యక్షుడు నరిచేటి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తాలూకా సెంటర్‌లో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు బాడుగలు తగ్గాయన్నారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు తమకు న్యాయం చేయాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీ చెన్నకేశవ, డీఆర్ మస్తాన్, మహబూబ్, రమేష్, చెన్నారావు, రామయ్య, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్కాలర్స్ స్కూల్‌లో గురుపూజోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, ఎం.జగదీష్‌రెడ్డిలు పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన డీఎస్సీలో ఉద్యోగం సాధించిన వి.రాంబాబు, సీహెచ్ అనుపమలను ఘనంగా సన్మానించారు.

● రాజుపాలెం: విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారని టీడీపీ సీనియర్ నాయకులు, మండల కాపు సంఘం అధ్యక్షుడు పులిబండ్ల సాంబశివరావు కొనియాడారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజుపాలెంలోని విశ్రాంత ఉపాధ్యాయురాలు ఇందిరమ్మను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెట్టి కోటేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం ప్రధానకార్యదర్శి పెద్దింటి శ్రీనివాసరావు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు లేబాకుల బ్రహ్మయ్య, యామర్తి వెంకట్రామయ్య, చొక్కా రాంబాబు, తోట సుభాష్, దుడుకు నాగేశ్వరరావు, వాసా నాగేశ్వరరావు, చెవుల వేంకటేశ్వర్లు, సభినాల లింగయ్య, చెవుల నాసరయ్య తదితరులు ఉన్నారు.

● రెంటచింతల: సమాజానికి మార్గదర్శకులు టీచర్లేనని వారి నేతృత్వంలో రూపుదిద్దుకున్న నేతలే దేశానికి మంచిపాలన అందిస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ అన్నారు. శుక్రవారం రెంటచింతలలోని శ్రీరామకృష్ణాగురుకులంలో గురుపూజోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే వివేకా టెక్నో, లిటిల్ ఏంజల్స్, ఫాతిమా విద్యానికేతన్, బాలవికాస్, అల్ఫోర్స్, సెయింటాన్స్, వైఆర్ఎస్, సెయింట్ జోసఫ్ పాఠశాలలో వేడుకలను నిర్వహించి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఆత్మకూరి నాగేశ్వరరావు, కేవీ నాగేశ్వరరావు, ఇగుటూరి రాజశేఖరరెడ్డి, రామ్మూర్తి, వి.సిల్వరాజ్, జె.కృష్ణారెడ్డి, డాక్టర్ చిన్నమ్మ, ప్రతాప్‌రెడ్డి, కేదార్, ఆరోగ్యరెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్, మట్టారెడ్డి, నాగిరెడ్డి, సైపీ పాల్గొన్నారు.

● అమరావతి: దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి విద్యారంగానికి రాధాకృష్ణన్ చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ కమిటీ సభ్యులు సాయిబాబు, హెచ్ఎం విజయ, సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందిన నారాయణను సన్మానించారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని వాసవి మణికంఠ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సన్మానించారు. కాకరపర్తి శ్రీనివాసరావు, కుంభా ఏడుకొండలు, అరవ సుధీర్, పీటర్ పాల్, కే నాగేశ్వరరావు, ఎన్ అరుణ్, జీ ప్రభాకర్, ఎం.సాంబశివరావు, పీ నాగసాయి ప్రసాదులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీ నాయక్, కేబీఆర్‌జే ప్రసాదు, శాస్త్రి, ప్రసాదరాజు, విశ్వేశ్వరరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గుళ్ళపల్లి కృష్ణ, అరవ సుధీర్ పీటర్ పాల్, కేబీఆర్‌జే ప్రసాదులను ఘనంగా సన్మానించారు. లోక్ జనశక్తి పార్టీ ఆధ్వర్యంలో రిటైర్డు ఉపాధ్యాయులు వై.ప్రభాకరరావు, షేక్ మాబూలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. వారికి అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందించారు.

● ముప్పాళ్ళ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నార్నెపాడు జి.యం.ఆర్ మెమోరియల్ స్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ జి.శివకుమార్ రెడ్డి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

● బెల్లంకొండ : మాజీ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్ళాలని రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, పీఎస్‌కే రసూల్, కొండవీటి రజాక్, సయ్యద్ మజీద్, ఎస్ పిచ్చయ్య, డీలర్ సుభానీ, కొండవీటి అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



రాజుపాలెంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు ఇందిరమ్మను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పడిపోయిన పరపతి

(5వ పేజీ తరువాయి)

వర్సిటీని ప్రక్షాళన చేయా ల్సింది పోయి ఓ ఉన్నతాధికారి అన్ని అంశాలకు అడ్డుగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం లోని అన్ని యూనివర్సిటీ లకు పూర్తి స్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ లు వచ్చాయి. ఒక్క ఎన్ జీ రంగా యూనివర్సిటీ మాత్రం నోటిఫికేషన్ నుంచి తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పీఎం, సీఎం ఆలోచనలకు బ్రేకులు..

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్ద పీట వేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. అందులో భాగంగానే నమో దీదీ పథకం ద్వారా డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా గ్రామాల్లోని రైతులను యూనివర్సిటీకి పిలిపించి డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని కొంతకాలం నిర్వహించారు. ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి శిక్షణను అర్థాంతరంగా నిలిపివేశారు. ఇన్‌చార్జి వీసీ ఆదేశాలతోనే డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు తెలుస్తుంది. ఒకపక్క రైతులకు డ్రోన్లు పంపిణీ చేసి వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తూ ఉంటే మరో పక్క అందుకు భిన్నంగా వీసీ ఆదేశాల ఇవ్వడం చర్చనీయాంశంగా మారుతుంది.

అంతు చిక్కని మరణాలపై పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

అక్కడికి పరిస్థితులను తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వెళ్లి ఇప్పటివరకు జరిగిన పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా బాధితుల ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న సేవల గురించి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి మంత్రులకు వివరించారు. మంత్రుల వెంట ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జీ రఘునందన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఉన్నారు.

అపోహలను నమ్మవద్దు : పెమ్మసాని

అంతు చిక్కని జ్వరాలకు బ్లడ్ కల్చర్ పరీక్షల ఫలితాల తర్వాతే స్పష్టత వస్తుందని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సూడోమల్లీ బ్యాక్టీరియా కారణంగా వచ్చే మెలియాయిడోసిస్ జ్వరాలు గ్రామంలో ప్రబలినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. అయితే తాగునీరు ద్వారా ఈ వ్యాధి రాదన్నారు. అపోహలను నమ్మవద్దన్నారు. అరుదైన వ్యాధి కావడం ఎవరికీ సరైన అవగాహన లేకపోవడం, తెలుసుకునేందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇది సర్వ సాధారణంగా కనిపించే వ్యాధి కాదని, తాను డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసిన సమయంలో కూడా ఇలాంటి వ్యాధిని చూడలేదన్నారు. పూర్తిస్థాయిలో వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరమే మెలియాయిడోసిస్ వ్యాధి గురించి తేల్చి చెప్పగలమని ఆయన అభిప్రాయపడ్డారు. బ్లడ్ కల్చర్ రిపోర్టులు శనివారం వెల్లడించే అవకాశం ఉంది. ఈ ఫలితాలు వస్తేనే తురకపాలెంలో ఇన్ఫెక్షన్‌కు దారి తీసిన కారణాలపై స్పష్టత వస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు.

ప్రైవేటు వైద్యనిపుణుల సాయం...

తురకపాలెంలో ప్రబలిన అంతుపట్టని వ్యాధుల నిర్ధారణకు గుంటూరులోని కొందరు ప్రైవేటు వైద్యనిపుణుల సాయం తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లైన వీరు ఆరోగ్య శాఖను సమన్వయం చేసుకుని రోగుల వ్యాధి నిర్ధారణలో తమ వంతు సాయం అందిస్తారు. దీనికి సంబంధించిన విధి విధానాలు ఒకటి, రెండు రోజుల్లో వెలువరిస్తారు.

బంగారం!

- పెట్టుబడిదారుల చూపుతో.. సామాన్యులకు దూరం
- వారంలో 24 క్యారెట్ల గ్రాము ధర రూ.1000 పెరుగుదల
- పది గ్రాములు రూ.1.11లక్షలకు చేరువ
- శ్రావణ మాసంలోనూ కొనుగోలుకు ప్రజలు దూరం

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారం అంటే ప్రతి ఒక్కరికీ మోజే.. సంపన్నులు మొదలు రోజువారీ కాయకష్టం చేసుకునేవారి వరకూ ప్రతి ఒక్కరూ పసిడిని ధరించాలని కోరుకుంటారు. అందుకే ఎంతోకొంత మిగలితే బంగారం కొనుక్కుందామనుకుంటారు. చిన్నా చితకా ఆభరణం చేయించుకుని మురిసిపోతుంటారు. గత కొంతకాలంగా బంగారంపై సామాన్యుల ఆశలు ఆవిరైపోతున్నాయి. అందుకు కారణం అసాధారణంగా పెరుగుతున్న పసిడి ధరలే! గడిచిన వారం రోజుల్లో పరిస్థితి మరింత మారిపోయింది. శ్రావణ మాసం ముగిసిన బంగారం ధరలు పెరుగుతుండడంతో ఆభరణాలు కొనుగోలుకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు.

వారంలో 10 శాతం పెరుగుదల

సరిగ్గా వారం రోజుల్లో బంగారం ధర 10 శాతం పెరిగింది. వారం రోజుల క్రితం వరకూ రిటైల్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ఒక గ్రాము రూ.10వేలు ఉండగా ప్రస్తుతం రూ.11వేల మార్కును దాటింది. బులియన్ మార్కెట్లో వారం రోజుల క్రితం వరకూ లక్ష రూపాయలు ఉన్న 10 గ్రాముల బంగారం ధర శుక్రవారం నాటికి రూ. లక్షా 11 వేల మార్కును చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర గ్రాము రూ.10,150, 10 గ్రాములు రూ. లక్షా 1,500లు పలుకుతోంది. బంగారంతో పాటు వెండి ధర కూడా అనూహ్యంగా పెరుగుతోంది. ప్రస్తుతం కిలో వెండి ధర కూడా 1.28 లక్షలకు చేరువయింది. బంగారం అండర్ సేల్‌లో చూసుకున్నా రూ.1.09 లక్షలకు తక్కువకు బంగారం దొరకడం లేదు. దీంతో చాలా మంది బంగారం జోలికి వెళ్లడానికి భయపడుతున్నారు.

20 నెలల్లో రెట్టింపు..

వాస్తవానికి 2023 చివరి నాటికి గ్రాము 24 క్యారెట్ల



బంగారం ధర రూ.6 వేలుగా ఉండేది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.75వేలకు చేరింది. జూలైలో కేంద్ర బడ్జెట్ పుణ్యమా అని బంగారం ధర ఒక్కసారిగా రూ.70 వేలకు తగ్గింది. మళ్లీ ఆగస్టు వచ్చే నాటికి రూ.75వేలకు పెరిగింది. ఏడాది తిరిగే సరికి ఆ ధర రూ.లక్షా 11 వేలకు చేరింది. 20 నెలల కాలంలోనే ఇలా రెట్టింపు ధర పెరగడంతో బంగారం జన సామాన్యానికి దూరమవుతూ వస్తోంది.

అంతర్జాతీయ పరిణామాలే కారణం

బంగారం ధరలు భారీగా పెరగడానికి అంతర్జాతీయంగా నెలకొన్నటువంటి పరిస్థితులు ప్రధాన కారణంగా చెబుతున్నారు. స్టాక్ మార్కెట్లలో నష్టాలు నెలకొన్న నేపథ్యంలో బంగారం ధరలు అమాంతం పెరిగాయని అంటున్నారు. స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ఉండడంతో మదుపర్లు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారని, ఆ కారణంగా బంగారం ధర పెరుగుతోందని అంటున్నారు. దీనికి తోడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు కూడా బంగారం ధరపై ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయంగా గమనించినట్లయితే బంగారం ధరలు అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఒక ఔన్స్ బంగారం ధర 3,579 డాలర్లకు చేరుకుంది. మరోవైపు డాలర్ ధర కూడా పడిపోతుండడంతో బంగారం ధరకు కాళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. పెద్ద పెద్ద పెట్టుబడిదారులంతా తమ నగదును బంగారం రూపంలోకి మార్చుకుంటుండడంతో బంగారం మొత్తం ఒకే చోట పోగుపడుతోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో ప్రస్తుతం బంగారం ధర ఆల్ టైం రికార్డ్ స్థాయికి చేరింది. ఈ పెరుగుదల ఎంతవరకూ ఉంటుంది, ఎప్పుడు ఆగుతుంది అనేది తెలియడం లేదు.

ఆభరణాలపై సన్నగిల్లిన ఆశలు

ధర అనూహ్యంగా పెరుగుతుండడంతో సామాన్యులు ఎవరూ బంగారు ఆభరణాల జోలికి వెళ్లడం లేదు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో సైతం లాంఛనంగా ఇచ్చిపుచ్చుకునే బంగారు ఆభరణాల వ్యయాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో పెళ్లిళ్లలో వధూవరులకు చైన్లు, కంఠాభరణాలు చేయించేవారు. ఇప్పుడు ఉంగరాలతో సరిపుచ్చుకుని, లాంఛనాలన్నీ నగదు రూపంలోనే చెల్లించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వర్ణకారులకు పని తగ్గిపోయింది. ధరలు స్థిరపడితే కొంతమేర పనులు పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. కిందటి నెల శ్రావణ మాసం అయినప్పటికీ బంగారు ఆభరణాలు చేయించుకున్నవారు చాలా పరిమితంగా ఉన్నారని స్వర్ణకారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మంగళగిరి, తెనాలి, విజయవాడ తదితర ప్రాంతాల్లో స్వర్ణకార వృత్తి చేసుకునే వేలాది మంది జీవనోపాధి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి.



నీల కంఠం..చుట్టూ నీళ్లు..!

దాచేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది వర వళ్లు తొక్కుతోంది. తీర ంలోని లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలను ముంచెత్తుతోంది. పనిలో పనిగా నది ఒడ్డున ఉన్న పరమేశ్వరుడిని ఆక్రమించేసింది. మండలంలోని కాట్రపాడు గ్రామ సమీపంలో కృష్ణా నది పుష్కరాల సమయంలో పుష్కర్ ఘాట్ నిర్మించారు. పరమేశ్వరుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. నాగార్జున సాగర్ డ్యాం నుంచి విడుదలైన వరద నీరు, పులిచింతల డ్యామ్ బ్యాక్ వాటర్‌తో ఒడ్డున ఉన్న శివయ్య నీల కంఠం వరకు నీళ్లొచ్చాయి. ఈ చిత్రాన్ని స్థానికులు తన మొబైల్ ఫోన్లలో బంధించి.. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు.

పీ-4 ఫలించింది.. వృద్ధురాలి ఇంటికి పునాది పడింది



నాగేశ్వరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీడీ బండారు శివలింగం

పిడుగురాళ్ల/రాజుపాలెం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): పీ-4 పథకంతో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓ వితంతు మహిళకు గృహం మంజూరైంది. రాజుపాలెం మండలం నెమలిపురి గ్రామానికి చెందిన మొండితోక నాగేశ్వరమ్మ ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన రామయ్య నాగేశ్వరమ్మకు పీ-4 పథకంతో గృహం మంజూరు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు లేఖరాశారు. దీంతో స్పందించిన కలెక్టర్.. నాగేశ్వరమ్మకు గృహాన్ని మంజూరు చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ బండారు శివలింగం నెమలిపురి ఎస్సీ కాలనీలో నాగేశ్వరమ్మ గృహనిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఈ వెన్నపూస శ్రీనివాసరెడ్డి, రాజుపాలెం, బెల్లంకొండ హౌసింగ్ ఏఈలు చంద్రశేఖర్, జోగారావు పాల్గొన్నారు.

62వ జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ లోగో ఆవిష్కరణ

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి అక్టోబరు 1 వరకు గుంటూరులోని విజ్ఞాన విశ్వవిద్యాలయంలో జరగబోయే 62వ జాతీయ చదరంగం చాంపియన్‌షిప్-2025 లోగోని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీనరసింహ ఆవిష్కరించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, విశ్రాంత న్యాయమూర్తి డీవీవీఎస్ సోమయాజులు, డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డాక్టర్ డీ సూర్యప్రకాశరావు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, సెక్రెటరి కె.జగదీష్, ముఖ్య సలహాదారు కేవీవీ శర్మ పాల్గొన్నారు.



లోగోని ఆవిష్కరిస్తున్న ఎస్సీ న్యాయమూర్తి శ్రీనరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్

ఎరువులు ఏమవుతున్నాయ్..

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెప్పారు. అయితే ఇప్పటికీ యూరియా వెతలు వెంటాడుతూనే ఉన్నాయి. సీజన్ మొత్తానికి కావాల్సిన ఎరువుల్లో ఇప్పటికే 60 శాతం పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. మొత్తం విస్తీర్ణంలో 70 శాతం సాగు కూడా ఇంకా పట్టాలెక్కలేదని ఈ-క్రాప్ లెక్కలే చెబుతున్నాయి. గుంటూరు జిల్లాలో 5125, పల్నాడులో 9132, బాపట్లలో 6789 టన్నుల యూరియా నిల్వలు అందుబాట్లో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అయితే యూరియా కోసం ఇక్కట్లు ఎందుకు వచ్చాయనే దానికి అధికారుల నుంచి సమాధానం లేదు. ఇప్పుడు తెచ్చుకోకపోతే యూరియా ఇక బయట దొరకదు అనే విధంగా తప్పుడు ప్రచారం జరగడం, దానిని నమ్మడం కూడా ప్రస్తుత పరిస్థితికి ఓ కారణంగా ఉంది. యూరియా పంపిణీలో రాజకీయ జోక్యం కూడా రైతుల ఇక్కట్లుకు ఒక కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు డీలర్లతో కొంతమంది ఉద్యోగులు కుమ్మక్కు కావడంతో బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం పంపిణీపై అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా సమస్య తీవ్రతరం కావడానికి కారణంగా కనబడుతోంది.

పంపిణీపై లెక్కలేవీ..

ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి. ఇక్కడే చాలావరకు పక్కదారి పట్టాయని రైతులు ఆరోపిస్తున్నారు. నేతలు చెప్పినవారికే భారీ యూరియా నిల్వలు



పొందుగుల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

తరలించారని, దీంతో చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ప్రారంభంలో యూరియా పంపిణీ విషయంలో లెక్కాపత్రాలేవీ లేకుండానే ఒక్కొక్కరికి 30 నుంచి 50 బస్తాల వరకు ఇవ్వడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణంగా కనిపిస్తుంది. ప్రభుత్వం భారీ స్థాయిలో యూరియా కేటాయించినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తుండగా, కొద్దిమంది వద్దకే ఆ నిల్వలు చేరడమే ఈ కటకటకు కారణంగా ఉంది. యూరియా విషయంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని అంచనా వేయలేకపోయిన అధికారులు ప్రారంభంలో పంపిణీని పట్టించుకోలేదు. స్థానికంగా ఉండే నేతల మీదనే వదిలేశారు. దీంతో వారు దీనిని అవకాశంగా చేసుకుని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. శాస్త్రీయంగా చూస్తే ఎకరానికి ఇప్పటి వరకు రెండు యూరియా బస్తాలను రెండు దఫాలుగా రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరుకు ఇంకోసారి నిబంధనల ప్రకారం అందించాలి. అది కూడా సదరు రైతు తంబ్ వేయించుకున్నాకే. కానీ వీటిని వదిలేసి ఒక్కొక్కరికి రెండు టన్నులు కూడా ఇచ్చారని, ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌కు కొంత తరలించడంతో అందరి ప్రయోజనం కాస్తా కొద్ది మందికే పరిమితమైనట్లు తెలుస్తోంది.

సమన్వయ లోపం కూడా కారణమే...

యూరియా ఇక్కట్లకు సంబంధించిన సంకేతాలు దాదాపు మూడు వారాల క్రితమే కనిపించాయి. అప్పుడే అప్రమత్తమవ్వాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. అందువల్లే ఇప్పుడు పరిస్థితి తీవ్రతరమైందని తెలుస్తోంది. వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, విజిలెన్స్‌తో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాలు కూడా సమన్వయంతో అడుగులు వేసి ఉంటే యూరియా పక్కదారి పట్టకుండా చాలా వరకు నియంత్రించగలిగే వారు. కానీ ఆయా విభాగాల మధ్య సమాచార లోపంతో పాటు బాధ్యతల విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరించడం కూడా పరిస్థితి అదుపు తప్పడానికి కారణమైందన్న విమర్శలు వస్తున్నాయి.


రైతుల మధ్య ఘర్షణలు..

యూరియా నిల్వలు వచ్చాయని తెలిస్తే ఆర్ఎస్కేలు, సొసైటీల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో రైతుల మధ్య ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రేపల్లె మండలం నల్లూరుపాలెంలో ఎరువుల కోసం శుక్రవారం రైతులు ఎగబడటంతో చిన్నపాటి గొడవలు జరిగాయి. పోలీసులు దగ్గరుండి క్రమ పద్ధతిలో రైతులకు యూరియాను అందించాల్సి వచ్చింది. పలుకుబడి ఉన్నవారు ఐదు, పదికట్టలు క్యూలో నుంచో కుండా తీసుకువెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొంత మంది దళారులు, పీఏసీఎస్ అధ్యక్షులు అధిక ధరలకు యూరియాను అమ్ముకుంటున్నారంటున్నారు.

సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని మోసం

- రూ.70 వేలు తీసుకున్న దళారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని నమ్మించి మోసగించిన ఓ దళారీని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లాలోని వెంగలాయపాలెంకు చెందిన హరి నాగసాయి కార్తీక్ కొన్నేళ్లుగా భక్తులను మోసగిస్తూ అందినవరకు దోచుకుంటున్నాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో 'శ్రీప్రభాకర చార్యులు' అనే నకిలీ ఖాతాను తెరిచాడు. తాను తిరుమలలో సహాయ అర్చకుడినని, బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవ టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసం చేయడం మొదలుపెట్టాడు. ఆదిత్య, హరికృష్ణ, నాగార్జున అనే మరో ముగ్గురి సహాయంతో బ్యాంకు ఖాతాలు కూడా తెరిచాడు. ఈ ముఠా తిరుపతికి చెందిన విజయ్ అనే భక్తుడికి నాలుగు సుప్రభాతసేవ టికెట్లు ఇప్పిస్తామని చెప్పి రూ.70,070 తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ ఎస్‌ఐలు రమేష్‌బాబు, చలపతి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలోని కర్ణాటక సత్రాల వద్ద కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్దనున్న రూ.1.03 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నారు. ఇప్పటికే కార్తీక్‌పై తిరుమల వన్‌టౌన్, టూటౌన్‌లో రెండు కేసులు, తిరుపతి ఈస్ట్‌లో మరో కేసు నమోదై ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే 16 మంది ఎన్ఆర్ఐ భక్తులకు అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.36 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జైలుకు వెళ్లి.. బెయిల్‌పై వచ్చిన కార్తీక్.. మళ్లీ భక్తులను మోసగించడం మొదలు పెట్టాడని పోలీసులు తెలిపారు.



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు డాక్టర్.జె.ప్రతాప్, తిమ్మాయిపాలెం జడ్పీ, బాపట్ల

మాస్టార్లకు ఘన సత్కారం

గురువులకే గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విజయవాడలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం 175 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్లుగా గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లు పేరుపేరునా సత్కరించారు. విద్యాశాఖలో 78 మంది ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్‌లో 26 మంది జూనియర్ లెక్చరర్లు, ఉన్నత విద్యలో 56 మంది ప్రొఫెసర్లు, డిగ్రీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 మంది లెక్చరర్లను ఉత్తమ టీచర్లుగా గుర్తించి అవార్డులు ప్రదానం చేశారు.

- అమరావతి



కె.మోహనాంజలి, మక్కెనవారిపాలెం జడ్పీ బాపట్ల



ఎం.ధనలక్ష్మి, ఎంపీయూపీ అద్దంకి



బి.శివకుమారి, నకరికల్లు జెడ్పీహెచ్ఎస్



ఎం.పార్వతి, ఎస్‌బీపురం జడ్పీ హెచ్ఎస్



సునీత రాణి, ఎస్ఎస్ఎన్ఓ, గుంటూరు



జి.సుశీల మాధవి, పీఎంసీ హెచ్ఎస్, గుంటూరు



డాక్టర్.ఎ.భద్రావతి ఎంపీపీ మోడల్ చెల్లిపాలెం



బి.లక్ష్మణరావు, జీజేసీ, చేబ్రోలు



ఎ.లక్ష్మీదేవి, జీపీసీ, దుర్గి



ఎ.లావణ్య, ఎస్ఎం జీపీసీ(జీ), బాపట్ల



సీహెచ్ మోసేస్ అరవింద్, ఎంబీటీఎస్ పాలిటెక్నిక్



ఆర్.ప్రకాశరావు, ఎంబీటీఎస్ పాలిటెక్నిక్



వి.నగేష్‌బాబు, పాలిటెక్నిక్, పొన్నూరు



ప్రొ.సూర్యదేవర విద్యాధర, చేబ్రోలు హనుమయ్య, ఫార్మసీ



ప్రొ.పి.శ్రీనివాసబాబు, విజ్ఞాన్ ఫార్మసీ




ప్రొ. తలశిల ఈశ్వర గోపాల కృష్ణమూర్తి, బాపట్ల ఫార్మసీ




డాక్టర్, పి.హేమలత, జేఎంజే కాలేజ్ ఉమెన్స్




ప్రొ.గుజ్జు చెన్నారెడ్డి, ఏఎన్‌యూ



ప్రొ.పిపిఎస్.పాల్ కుమార్,ఏఎన్‌యూ



ప్రొ.వి.దివ్యతేజో మూర్తి, ఏఎన్‌యూ



డాక్టర్ పి. సుధాకర్,ఏఎన్‌యూ



ప్రొ.ఆర్.రమేష్‌రాజు, ఏఎన్‌యూ



ప్రొ.కె.జయలలిత, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



ప్రొ.లాల్ అహ్మద్ మొహ్మద్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



ప్రొ డి.సుబ్రహ్మణ్యం, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



వై.రాజ్యలక్ష్మి, ఎంపీపీఎస్, కనపర్రు

అర్బన్ హాస్పిటల్‌లో డీఎంహెచ్‌వో తనిఖీ

వినుకొండటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హను మాన్ నగర్‌లోని అర్బన్ హాస్పిటల్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ రవికు మార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వైద్యశాలలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

క్రైస్తవుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి

వినుకొండటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చర్చిల పాస్టర్లు, క్రైస్తవుల రక్షణ కోసం ప్రత్యేక విధానాన్ని లేక చట్టాన్ని రూపొందించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబరు 16వ తేదీన ఉద యం 10 గంటలకు, వెల్లటూరు రోడ్డులోని జిప్సీ ప్రార్థన మందిరం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిపి తహసీల్దా ర్‌కు వినతిపత్రం సమర్పిస్తారని సమావే శంలో తీర్మానించారు. సమావేశంలో బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి స్పర్జన్, బాప్టిస్ట్ సంఘ అధ్యక్షుడు చాట్ల రామయ్య, కార్యదర్శి ఆర్‌సీ వరప్రసాద్, ఆర్పీఎఫ్ అధ్యక్షుడు ఎస్.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సుగుణకుమారికి పదోన్నతి

శావల్యాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిష త్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న పొట్టిపాలెం సుగుణకుమారికి ఎంపీ డీవోగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లాలో ఎంపీడీవోగా సుగుణకుమారి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. డిప్యూటీఎంపీడీవోగా సుగుణకుమారి మూడేళ్లుగా శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతి పొందిన సుగుణకుమారికి ఎంపీడీవో సీతారామయ్య, ఇన్‌చార్జి ఏపీవో ఆంజనేయరాజు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

గిరి ప్రదక్షిణకు ముమ్మర ఏర్పాట్లు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదివారం పౌర్ణమి సందర్భంగా కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి వారి గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఉదయం 5 గంటలకు ప్రారంభమవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు ఘాట్ రోడ్డు దగ్గర ఉన్న విజయ గణపతి దేవాలయం వద్ద అల్పాహారం, మార్గం మధ్యలో మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. గిరి ప్రదక్షిణను భక్తులు భక్తిశ్రద్ధలతో పూర్తి చేసుకుని స్వామిని దర్శించుకోవాలని కోటప్పకొండ సేవాసమితి అధ్యక్షుడు అనుమోలు వెంకయ్యచౌదరి తెలిపారు.

ఏకగ్రీవంగా ఐ టీడీపీ కార్యవర్గం ఎన్నిక

చిలకలూరిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణ ఐ టీడీపీ కమిటీ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా అమరా మణి కుమార్, ప్రధాన కార్యదర్శిగా బెంగుళూరి హనుమాన్ సింగ్ ఎన్నికయ్యారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నూజెండ్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ అప్పాపురం ఎస్సీ కాలనీలో పేద కుటుంబాల వారికి అరుంధతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గర్నెపూడి ఈశ్వరయ్య, నెట్టెంపూడి బర్న, శిఖా రామయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఐసీయూ బెడ్ వితరణ

శావల్యాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగుల సౌకర్యార్థం మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన కంచర్ల చినఆంజనేయులు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు రూ.15వేలు విలువజేసే ఐసీయూ బెడ్‌ను శుక్రవారం వితరణ చేసినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు తెలిపారు. కార్యక్రమంలో దాతలు కంచర్ల సుబ్రమణ్యం, సురేష్, అంజలి, స్టాఫ్‌నర్సు ప్రమీల పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

యడ్లపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట శివారు గ్రామం సంగం పరిధిలోని ఓ పేకాట స్థావరంపై పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. స్థావరంలో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.7,540 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ వెల్లడించారు.

రైతు ర్యాలీని విజయవంతం చేయాలి

● డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో ఈ నెల 9న నిర్వహించనున్న రైతు ర్యాలీలో వైసీపీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

రొంపిచర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని రొంపిచర్ల గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యా యుడు దొప్పలపూడి జీవరత్నం(75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన సుమారు 30సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. నరసరావుపేటలోని ఆయన స్వగృహంలో మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామపెద్దలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే-రిడ్జ్ ఇంటర్‌నేషనల్ స్కూల్లో శుక్రవారం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యా యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చైర్మన్ నాతాని వెంకటేశ్వ ర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పదనాన్ని వివరించా రు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బర్న బాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో....


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి తదితరులు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ 'ఉపాధ్యాయులే సమాజ నిర్మాణ శిల్పులు' అని అన్నారు. కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ దేశంలోని గర్వించదగిన ఇంజనీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు ఉపాధ్యాయుల నిస్వార్థ సేవలు ద్వారా రూపు దిద్దుకున్నారని అన్నారు. ప్రిన్సిపాల్ ఎస్ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఎన్ఈసీ ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

● నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. కళాశాల చైర్మన్, ఎంఆర్ శేషగిరిరావు, డైరెక్టర్ శ్రావ్య పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు, దేశ భవిష్యత్తు అంతా వారి చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాధినేని రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొ న్నారు.

● రొంపిచర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపాలెం పీఎం శ్రీమోడల్ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవినా యక్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు శుక్రవారం అందుకున్నారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణవేణి కళాశాల ఆధ్వర్యంలో....


గురుపూజోత్సవంలో కృష్ణవేణి కళాశాల యాజమాన్యం

వినుకొండటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దినోత్సవం సంద ర్భంగా పట్టణంలోని కృష్ణవేణి కళాశాల ఆధ్వర్యంలో స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు కళాశాల అధ్యాపకులను పూలమాలలతో సత్కరించి నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ బి.లింగారావు, మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

● పట్టణంలోని విజేత కాన్సెప్ట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కావూరి సాయికుమార్, ఆవుల మంద బ్రహ్మయ్యలు పాల్గొని సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● వినుకొండటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండకు చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రభుత్వం అందజేసింది. కరీముల్లా ప్రస్తుతం మండలంలోని నాగులవరం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

● యడ్లపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలువురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. కొండవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు షేక్ జున్నుసాహెబ్, జగ్గాపురం ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ) పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ వి.నాగమల్లేశ్వరాచారి, ఉన్నవ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ ఎం స్నేహలతారెడ్డి, లింగారావుపాలెం జడ్పీహెచ్‌ఎస్- స్కూల్ అసిస్టెంట్ ఎం శౌరిలు, యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాల- వ్యాయామోపాధ్యాయుడు పి.పాల్‌సుధాకర్‌లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా అందుకున్నారు. కాగా సొలస ఎంపీపీ స్కూల్‌లో ఎస్‌జీటి గా పనిచేస్తున్న షేక్ షమ్మీబేగం చిలకలూరిపేట రోటరీక్లబ్ వారి బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైంది.

● చిలకలూరిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పోతవరంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రధానోపాధ్యాయిని షేక్ అఫ్రషున్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. .

● శావల్యాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం జడ్పీపాఠశాల ఉపాధ్యాయులు గురుబాబు, వేల్పూరు బీసీ కాలనీ ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయని ఎలిజబెత్ కలెక్టర్ చేతులమీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నట్లు ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు తెలిపారు.

● నూజెండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఎస్ఆర్‌కే ప్రసాదు, తపాల శివ, భూక్యా శ్రీను, సరసు సుజాతలు శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయులుగా కలెక్టర్ అరుణ్‌బాబు, విద్యాశాఖ అధికారి చంద్రకళ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.


ఎంఈవో పార్వతిని సన్మానిస్తున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

● బొల్లాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఎంఈవోగా ఎన్నికైన బొల్లాపల్లి - 2 జిల్లా ఉత్తమ విద్యాశాఖ అధికారిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నరసరావుపేటలో ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు, డీఈవో చంద్రకళ చేతుల మీదుగా అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందుకు న్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యా య సంఘ నేతలు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

● బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరులో శుక్రవారం వాసవీక్లబ్ వైభవ్ వెల్లటూరు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవీక్లబ్ వైభవ్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సెక్రటరీ అర్వపల్లి వెంకట సుబ్ర హ్మణ్యం, ఉపాధ్యాయిని సీహెచ్ సౌజన్యను పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

● నాదెండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరంలో గల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్ చంద్రశేఖర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వై భాస్కరరావు, కే కృష్ణారావు, కార్యవర్గం టీ శివరామకృష్ణ, కే కోటేశ్వరరావు, కొండయ్య, వెంకన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు ఖరీఫ్ సీజన్‌కు యూరియా

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన మేర కు యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామంలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల కట్టల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ 'కూటమి రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోంది. జొన్నలగడ్డలో రైతులకు ఎరువులను పంపిణీ చేయడం ద్వారా రైతులకు మా ప్రభుత్వం అండగా నిలుస్తోందని అని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, డాక్టర్ రాంప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో టీచర్స్ డే..

నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో టీచర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబు ముఖ్యఅతిథిగా హాజరై, నియోజకవర్గంలోని విద్యాబోధన రంగంలో విశేష సేవలం దిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.


ప్రజాసమస్యల పరిష్కారమే నా లక్ష్యం

ప్రజాసమస్యల పరిష్కారమే నా లక్ష్యం అని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. శుక్ర వారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, త్వరిత గతిన పరిష్కారాలు చేస్తానని బాధితులకు తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

● పట్టణంలోని 12వ వార్డులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే శానిటేషన్ పనుల్లో పాల్గొని, రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

● నరసరావుపేటలోని అన్న క్యాంటీన్‌ను అరవిందబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న ఈ క్యాంటీన్ నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు.

ఏపీ ఎన్జీవో పల్నాడు జిల్లా అడహక్ కమిటీ ఏర్పాటు



రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న అడహక్ కమిటీ చైర్మన్ ఎం రామకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా ఏపీ ఎన్జీవో అడహక్ కమిటీ ఏర్పాటు జరిగింది. శుక్రవారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో రిక్రియేషన్ హాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీవో కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలపర్తి విద్యాసాగర్, డీవీ రమణలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అడహక్ కమిటీ చైర్మన్‌గా ఎం రామకృష్ణ, ట్రెజరర్‌గా బ్రహ్మేశ్వరరావు, సభ్యులుగా రామయ్య, అప్పారావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వర రావులను నియమించారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో ఉద్యోగులు సభ్యత్వ నమోదు పూర్తి చేసి నవంబరు నెలలో పల్నాడు జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏర్పడుతుందన్నారు. తనను అడహక్ కమిటీలో నియమించినందుకు ఎం రామకృష్ణ తదితరులు రాష్ట్ర అధ్య క్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

గణపతికి 1108 బూడిద గుమ్మడికాయలతో అష్టోత్తరపూజ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మద్ది రాఘవయ్య బావి వీధి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన మహావీర గణపతికి శుక్రవారం పదో రోజు 1108 బూడిదగుమ్మడికాయలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. స్వామివారికి 1108 కలువ పూలతో విశేషంగా పూజ జరిగింది. 1108 యాపిల్స్‌తో స్వామి వారికి సహస్ర నామార్చన చేశారు. మహావీర గణపతిని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ దంపతులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ దర్శించుకున్నారు. కార్యక్రమంలో వీరవల్లి వంశీ, రామిశెట్టి వాసు, ఉత్సవ కమిటీ కన్వీనర్ వనమా పవన్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.


రూ.2.52లక్షలు పలికిన గణేష్ లడ్డూ

వినుకొండటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినుకొండ స్టేట్ బ్యాం కు రోడ్డులో గణేష్ ఉత్సవ కమిటీ 14వ వార్షికోత్సవం వైభవంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించారు. మొదట పెద్ద లడ్డూ పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పోట్ల రాధాకృష్ణమూర్తి కుమారుడు అమర శ్రీనివాసరావు రూ.2.52లక్షలకు, రెండో లడ్డూను మహిళల విభాగంలో రామడుగు శివలక్ష్మి, రూ.2.05 లక్షలకు కైవసం చేసుకున్నారు. గణేష్ మహోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఉమ్మడి గుంటూరు జిల్లా డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు లడ్డూను దక్కించుకున్న భక్తులను అభినందించారు.

● నాదెండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూబాడు గ్రామంలోని వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డును కోడూరు శివ శంకర్ రూ.70,200లకు దక్కించుకున్నారు. కనపర్రులో రూ.65వేలకు సోమేపల్లి తాతయ్య, రూ. 60వేలకు గణేష్ యూత్ వారు లడ్డును దక్కించుకున్నారు.

● రొంపిచర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలో గణపతి నవరా త్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన గణనాధుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీపాలతో శివ లింగాకారాన్ని ఏర్పాటు చేశారు. తులసి కోట, చౌడేశ్వరిదేవి అమ్మవారి గుడి, దేవుడు మాన్యం కాలనీల్లో గణనాధుని విగ్రహాలు పూజలు అందుకుంటున్నాయి.

బ్రహ్మం చౌదరికి ప్రత్తిపాటి సత్కారం



బ్రహ్మం చౌదరిని సత్కరిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమ్మ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం నాదెండ్ల బ్రహ్మం చౌదరి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును ఇక్కడి ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మం చౌదరిని ప్రత్తిపాటి సత్కరించారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంతో బాగా విధులు నిర్వహించడమేకాక, లోకేష్ యువగళం పాదయాత్రలో నాదెండ్ల బ్రహ్మం చౌదరి కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రశంసించారు.

పసుమర్రులో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పసుమర్రులో చిన్న మసీద్ సెంటర్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవులకు ఆచరణీయమని మౌలానా షేక్ బాజీ షహిద్ చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ నసీమా, షేక్ అబ్దుల్ రౌఫ్, షేక్ గౌసియా, షేక్ ఫర్మానుల్లా, షేక్ సానియా, షేక్ జాఫర్ వలి,షేక్ నజియా, సయ్యద్ పీర్ పాల్గొన్నారు.

నితిన్ భార్గవ్‌కు లా గ్రాడ్యుయేషన్‌లో బంగారు పతకాలు


నితిన్ భార్గవ్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటకు చెందిన కొత్త నితిన్‌భార్గవ్‌కు లా గ్రాడ్యుయేషన్‌లో నాలుగు బంగారు పతకాలు సాధించారు. నితిన్ భార్గవ్ విశాఖపట్నంలో దామోదరం సంజీవయ్య నేషనల్ లా విశ్వవిద్యాల యంలో లా పూర్తి చేశారు. క్రిమినల్ అండ్ పేనోలాజీ, లేబర్ లా, క్రిమినల్ లా, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో బంగారు పతకాలు సాధించారు. దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో బంగారు పతకాలు అందజేశారు.


అన్న సంతర్పణ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

అవినీతి, అహంకారం, ధనాశతో రాష్ట్రం దివాళ

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అహంకారం, అంతులేని ధనాశతో జగన్ ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని దివాల తీయించాడని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గణపవరంలోని అయ్యప్ప స్వామి దేవాలయ 13వ వార్షికోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మండలనేని వెంకటేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు అయ్యప్పదారుల కోసం ఏర్పాటు చేసిన అన్న సంతర్పణను ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువు లేని విద్య, ఆలోచన లేని పరిపాలన నిష్ప్రయోజనం అన్న విషయాన్ని వైసీపీ ప్రభుత్వం నిజం చేసిందన్నారు. రాష్ట్రంపై ఏ మాత్రం అవగాహన లేని నాయకుడని గ్రహించాకే జగన్‌ను ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేశారని విమర్శించారు. నీతి నిబద్ధత ఉన్న నాయకుడు కనుకనే చంద్రబాబు 15 నెలల పరిపాలనలో తన దైన ముద్ర వేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మునిసిపల్ చైర్మన్ రఫానీ, టీడీపీ, జనసేన సమన్వయ కర్తలు సదాశివరావు, రాజా రమేష్, నాయకులు మండలనేని చరణ్ తేజ, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ, హిమంతరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శికి అంతర్జాతీయ పురస్కారం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ప్రతిష్ఠాత్మకమైన అవుట్‌స్టాండింగ్ లీడర్ అవార్డు ఇన్ లీడర్‌షిప్‌ను లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ నుంచి అందుకున్నారని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మల్లికార్జున్ శుక్రవారం తెలిపారు. ఆగస్టు 31న లండన్‌లో నిర్వహించిన వరల్డ్ లీడర్స్ సమ్మిట్‌లో ఈ అవార్డు ప్రదానం చేశారన్నారు. విద్యారంగంలో శాంతి శ్రీనివాస రెడ్డి ఆవిష్కరణాత్మక ఆలోచనలు, దూరదృష్టి, మహిళా నాయకత్వానికి ఇది ఒక గొప్ప గుర్తింపు అన్నారు. అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విలువలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలతో ముడిపడి ఉండాలన్నారు. అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డిని కళాశాలలో ఫార్మసీ, ఇంజనీరింగ్, డిప్లొమో ప్రిన్సిపాల్స్, అన్ని విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.


శాంతి శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు

ఘనంగా విశ్వసాయి జూనియర్ కళాశాల వార్షికోత్సవం

వినుకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల బ్రహ్మనాయుడు కన్వెన్షన్‌లో విశ్వసాయి జూనియర్ కళా శాల విజయోత్సవ సభ గురువందనంతో ఎనిమిదో వార్షికోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. సీనియర్ ఆంగ్ల అధ్యాపకుడు పోక హనుమంతరావు, ఇతర అధ్యాపక బృందానికి, అధ్యాపకేతర బృందాన్ని కళాశాల డైరెక్టర్ యడవల్లి శ్రీనివాస్ శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావనిలు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీ సురేష్, జీవీ రమణారావు, జనసేన నాయకుడు నిశంకర శ్రీనివాస్, విశ్రాంత హెచ్ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి


రొంపిచర్ల జీడీసీఎంఎస్ గోదాములో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు

రొంపిచర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలో గల జీడీసీఎంఎస్ గోదామును జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు శుక్రవారం తనిఖీ చేశారు. అదే విధంగా ఆరేపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, ఈ పాసు మిషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎరువులు ఇచ్చిన వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసి అమ్మిన ఎరువులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలా చేయని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియాను అధికంగా కొనుగోలు చేసి ఇళ్లల్లో స్టాక్ చేయవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో శివ లలిత, వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటరావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కారుమంచి ఘటనలో ఇరువర్గాలపై కేసులు


గాయపడ్డ సురేష్

శావల్యాపురం,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో ఇరువర్గాలకు మధ్య జరిగిన ఘర్షణలో పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కారుమంచి లైబ్రరీ సెంటర్‌లో గణేష్‌యూత్ ఆధ్వర్యంలో టీడీపీ వర్గీయులు ఏర్పా టు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనంలో భాగంగా విగ్రహాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు గ్రామంలోని సత్రం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్దకు రాగానే వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఘర్షణలో టీడీపీ నాయకుడు ముప్పా సురేష్‌ను వైసీపీ వర్గీయులు కర్రతో కొట్టడంతో తలకాయ పగిలింది. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే ఇరువర్గాలను వారించి అక్కడి నుంచి పంపించారు. ఘర్షణకు పాల్పడిన, ప్రేరేపించిన వైసీపీ వర్గీయులను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘర్షణలో గాయపడిన సురేష్ ఫిర్యాదు తో వైసీపీ వర్గీయులు కొందరిపై కేసులు నమోదు చేయగా వైసీపీకి చెందిన బండారుపల్లి దివ్య ఫిర్యాదుతో టీడీపీకి చెందిన కొందరిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేశ్వరరావు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 30మందితో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని ఎస్‌ఐ తెలిపారు.